
సాక్షి అనంతపురం

బుధవారం । 18 । జనవరి । 2023



రిమాండ్‌కు ఘరానా మోసగాళ్లు

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్లాటును కొట్టేయాలనుకున్న ఘరానా మోసగాళ్లను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టం రూ.4, సరాసరి రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.8°/09.7°

జిల్లా అంతటా మంగళవారం చలి తీవ్రత కొనసాగింది. పగలు ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

తపాలా సేవలపై 23 వరకు ఫిర్యాదుల స్వీకరణ

అనంతపురం సిటీ: తపాలా కార్యాలయాల్లో లభించే సేవలకు సంబంధించి ప్రజా ఫిర్యాదులను ఈ నెల 23 వరకు స్వీకరించనున్నట్లు ఆ శాఖ అనంతపురం పీఆర్‌ఓ ప్రమోద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తపాలా సేవల్లో అలసత్వం, ఇతర సమస్యలతో పాటు తపాలా ఉద్యోగుల నుంచి ఎదురయ్యే ఇబ్బందులు ఏమైనా ఉంటే కె.సుధీర్‌బాబు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ జనరల్(ఫిర్యాదులు, సంక్షేమం), చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ విజయవాడ–520013 కార్యాలయానికి పోస్ట్‌లో పంపాల్సిందిగా కోరారు. పోస్ట్ కవర్‌పై 'డాక్ అదాలత్' అని స్పష్టంగా రాయాలని సూచించారు. డాక్ అదాలత్ ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఫిర్యాది/అర్జీ పరిష్కారం లెటర్/ఈ–మెయిల్ ద్వారా సమాధానాలు పంపనున్నట్లు వెల్లడించారు.

20 వరకు ఉచిత బియ్యం

అనంతపురం అర్బన్: కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీని ఈ నెల 20 వరకు పొడిగించినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. వాస్తవంగా పంపిణీ 17 వరకు చేయాల్సి ఉండగా.. సంక్రాంతి పండుగ సందర్భంగా కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉంటారని, అలాంటి వారు బియ్యం, సరుకులు తీసుకుని ఉండరనే ఉద్దేశంతో మరో మూడు రోజులు పొడిగించినట్లు వెల్లడించారు. బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు కందిపప్పు, చక్కెరను కార్డుదారులకు అందిస్తున్నట్లు తెలిపారు.

అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు ఎంపిక

అనంతపురం: సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్‌గా నారాయణ స్వామి (ఎంపీయూపీ స్కూల్, గొట్కూరు, కూడేరు మండలం), అసిస్టెంట్ అలెస్కోగా వై.రవి (స్కూల్ అసిస్టెంట్, ఎంపీయూపీ స్కూల్, కనంపల్లి, బ్రహ్మసముద్రం మండలం), అసిస్టెంట్ ఏఎంఓగా ఎం.చంద్రమోహన్‌రెడ్డి (ఎంపీయూపీ స్కూల్, వ్యాసాపురం, ఉరవకొండ మండలం), అసిస్టెంట్ సీఎంఓగా హెచ్.తిప్పేస్వామి (జెడ్పీహెచ్ఎస్, కంబదూరు మండలం)ని నియమించారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు మూడు సంవత్సరాల పాటు ఫారిన్ సర్వీసు పోస్టుల్లో కొనసాగనున్నారు.

అనంత ఒకప్పుడు తీవ్ర వర్షాభావం ఎదుర్కొన్న ప్రాంతం. కానీ మూడేళ్లుగా పరిస్థితి మారింది. వరుణుడు కరుణించడంతో ఇప్పుడు ఎటు చూసినా జలమే... వాగులు, వంకలు, నదుల్లో నీరు పారుతోంది. రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కూడా హంద్రీనీవా నీటితో చెరువులన్నీ నింపడంతో పాటు వర్షరూపంలో వచ్చే ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పడుతూ భూమిలో ఇంకేలా చేస్తోంది. దీంతో భూగర్భజలమట్టం కూడా పైపైకి ఎగబాకింది. ఫలితంగా ఈ వేసవిలో తాగు, సాగునీటి ఇబ్బందులకు ఆస్కారమే ఉండదని అధికారులు చెబుతున్నారు.



పాతాళగంగ పదిలం

- విస్తారంగా వర్షాలతో నిలకడగా భూగర్భ జలమట్టం
- రిజర్వాయర్లలోనూ పుష్కలంగా నీరు
- సాగునీటికి ఢోకా లేకపోవడంతో రైతన్నల హర్షం
- వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉండవంటున్న అధికారులు



రాప్తాడు ప్రాంతంలో గతంలో ఎండిపోయిన బోరుబావి నుంచి ఇప్పుడు సమృద్ధిగా నీరు

అనంతపురం అగ్రికల్చర్: వరుణుడు కరుణిస్తుండటంతో పాతాళగంగ పదిలంగా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 460 మి.మీకు గానూ 41 శాతం అధికంగా 650 మి.మీ మేర వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు బాగా పెరిగాయి. వర్షాల రూపంలో 234 టీఎంసీలు నీటి ప్రవాహం ఉండగా, అందులో 28 టీఎంసీలు భూగర్భంలోకి వెళ్లాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. 31 మండలాల పరిధిలోని 97 ఫిజోమీటర్ల నుంచి తాజాగా భూగర్భజలశాఖ సేకరించిన గణాంకాలు చూస్తే సగటు నీటి మట్టం 5.38 మీటర్లుగా నమోదైంది. గత పాతికేళ్ల చరిత్ర తిరగేస్తే జనవరి నెలలో ఈ స్థాయిలో నమోదు కావడం ఇదే తొలిసారి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1.87 లక్షల బోరు బావుల నుంచి నీరు సమృద్ధిగా వస్తుండటంతో వ్యవసాయ, ఉద్యాన, పట్టు రైతులు సాఫీగా సేద్యపు పనులు చేసుకుంటున్నారు. రైతులు, కూలీలకు చేతినిండా పనులు ఉండటంతో వలసలకు తావులేకుండా పోయింది. మూడేళ్లుగా భారీ వర్షాలు ముంచెత్తుతుండటంతో 'వాల్టా' గ్రామాల సంఖ్య 33 దాటలేదు. 28 మండలాలు సేఫ్‌జోన్‌లో ఉండగా కేవలం మూడు మండలాల్లో మాత్రమే నీటివాడకం ఎక్కువగా ఉంది.

గతమంతా కష్టాలే

ఒకసారి వెనక్కి చూస్తే... 2014–18 మధ్య కాలంలో వర్షాభావ పరిస్థితులు కారణంగా నీళ్లు రాక వేలాది బోర్లు ఎండిపోయాయి. భూగర్భజలాల మట్టం సగటున 20 నుంచి 27 మీటర్లకు పడిపోయింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 40 నుంచి 45 మండలాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి. 300 గ్రామాల వాల్టా పరిధిలో ఉండేవి. పనుల్లేక ఏటా లక్షల సంఖ్యలో రైతులు, కూలీలు, పేదలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారు. కానీ... మూడేళ్ల నుంచి పరిస్థితి మారింది. విస్తారంగా వర్షాలు పడుతుండటంతో 'అనంత' జలకళను సంతరించుకుంది. వరి, వేరుశనగ, ఆముదం, కంది, మొక్కజొన్నతో పాటు ఉద్యాన తోటలు, కూరగాయల పంటలు, మల్బరీ విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. పశుపోషణ, పాడి అభివృద్ధికి ఢోకా లేకుండా పోవడంతో రైతుల నుంచి హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

వేసవిలోనూ ఇబ్బంది ఉండదు

భూగర్భజలాలు మెరుగ్గా ఉండటంతో రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కూడా ఇబ్బంది ఉండదు. సాధారణంగా వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యేది. కానీ మూడేళ్లుగా వేసవిలో ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. 26 మండలాల్లో నీటిమట్టం 8 మీటర్లలోపే కనిపిస్తోంది. ఐదు మండలాల్లో భూగర్భ జలం 8 నుంచి 15 మీటర్ల మధ్య ఉంది. వర్షాలకు తోడు హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా చెరువులు నింపడంతో జిల్లా వ్యాప్తంగా నీటి లభ్యత గణనీయంగా పెరిగింది.

– కె.తిప్పేస్వామి, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భజలశాఖ

మండలాల వారీగా తాజా సగటు నీటి మట్టం ఇలా

మండలం	నీటిమట్టం (మీటర్లలో)	మండలం	నీటిమట్టం (మీటర్లలో)
అనంతపురం	3.35	నార్పల	3.37
ఆత్మకూరు	2.38	పామిడి	7.77
బీకే సముద్రం	1.42	పెద్దపప్పూరు	0.43
బెళుగుప్ప	8.08	పెద్దవడుగూరు	3.77
బొమ్మనహాళ్	3.44	పుట్లూరు	6.76
బ్రహ్మసముద్రం	6.01	రాప్తాడు	1.73
డి.హీరేహాళ్	10.48	రాయదుర్గం	3.35
గార్లదిన్నె	1.05	శెట్టూరు	13.90
గుత్తి	8.15	శింగనమల	5.25
గుమ్మఘట్ట	5.64	తాడిపత్రి	4.74
గుంతకల్లు	2.78	ఉరవకొండ	2.74
కళ్యాణదుర్గం	5.22	వజ్రకరూరు	4.35
కంబదూరు	4.05	విడపనకల్లు	2.15
కణేకల్లు	5.61	యాడికి	13.11
కూడేరు	6.11	యల్లనూరు	5.78
కుందుర్పి	3.70		

460 మి.మీ ఈ ఏడాది సాధారణ వర్షపాతం

650 మి.మీ (41 శాతం అధికం) ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం

234 టీఎంసీలు వర్షం రూపంలో ప్రవహించిన నీరు

28 టీఎంసీలు భూమిలో ఇంకిన నీరు

5.38 మీటర్లు జిల్లా తాజా సగటు నీటి మట్టం

28 సేఫ్ జోన్‌లో ఉన్న మండలాలు

గజగజ @ 7.9 డిగ్రీలు

- మరింత పతనమైన కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి జిల్లా అంతటా పెరిగిన చలితీవ్రత

అనంతపురం అగ్రికల్చర్: కొన్ని రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు గజగజ వణికిపోతున్నారు. ఈనెల రెండో వారం నుంచి చాలా మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల్లోపే నమోదు అవుతుండటంతో చలితీవ్రత బాగా పెరిగింది. ముఖ్యంగా మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. మంగళవారం కూడా శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 7.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 9.7 డిగ్రీలు కనిష్టం నమోదైంది. అగళి 8.3 డిగ్రీలు, రొద్దం, తలుపుల 9.8 డిగ్రీలు, గాండ్లపెంట, కనగానపల్లి, వజ్రకరూరు 10 డిగ్రీలు, రాప్తాడు 10.2 డిగ్రీలు, సోమందేపల్లి 10.3 డిగ్రీలు, కొత్తచెరువు 10.4 డిగ్రీలు, శెట్టూరు, గుమ్మఘట్ట 10.6 డిగ్రీలు, రాయదుర్గం, కంబదూరు 10.8 డిగ్రీలు, ఎన్‌పీ కుంట, కుందుర్పి, పుట్లూరు, తనకల్లు 11 డిగ్రీలు, గుత్తి, గుడిబండ 11.1 డిగ్రీలు, తాడిమర్రి 11.2 డిగ్రీలు, హిందూపురం 11.3 డిగ్రీలు, యాడికి 11.5 డిగ్రీలు, తాడిపత్రి, ఉరవకొండ, ఓడీ చెరువు, చెన్నేకొత్తపల్లి 11.6 డిగ్రీలు, లేపాక్షి, శింగనమల, నల్లచెరువు 11.7 డిగ్రీలు, విడపనకల్లు, అమడగూరు, నార్పల 11.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, మిగతా మండలాల్లోనూ 12 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

హజ్‌యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లాలనుకునే ముస్లింల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది జూన్, జూలైలో హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు www.hajj.committee.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వెబ్‌సైట్ నుంచి ప్రింట్ తీసుకున్న దరఖాస్తును పూర్తి చేసి అవసరమైన పత్రాలు జతచేసి ఫిబ్రవరి 15వ తేదీలోపు వెబ్‌సైట్‌లో సూచించిన చిరునామాకు పంపాలని సూచించింది.

ఇన్‌చార్జ్ డీఈఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం: ఇన్‌చార్జ్ డీఈఓగా ఎస్.కృష్ణయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఉన్న ఇన్‌చార్జ్ డీఈఓ ఎం.వెంకటకృష్ణారెడ్డికి మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. దీంతో ఇన్‌చార్జి డీఈఓగా కృష్ణయ్యను నియమించారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, ఏఎస్‌ఓలు నాగరాజు, ఓబుళరెడ్డి నూతన ఇన్‌చార్జ్ డీఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు తోపుదుర్తిలో ఊరి దేవర

- విందుకు తరలిరావాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు



భోజన ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తోపుదుర్తి సోదరులు

ఆత్మకూరు: 'ఏ సమస్య వచ్చినా నాకు అండగా నిలిచారు. నన్ను నమ్మి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారు. మీకు సేవ చేసే అవకాశం లభించడం నా అదృష్టం. మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. మా ఇంట్లో పండుగ అంటే నియోజకవర్గంలో ప్రతి ఇంట్లో పండుగ జరిగినట్టే.. పెద్ద మనసుతో ప్రతి ఒక్కరూ ఇది మన ఇంటి పండుగలా భావించి తోపుదుర్తి గ్రామంలో బుధవారం జరిగే పెద్దమ్మతల్లి గ్రామోత్సవానికి తరలిరండి.. మా ఇంట విందు చేసి వెళ్లండి' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం తోపుదుర్తి గ్రామంలో 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. తోపుదుర్తి గ్రామంలో 140 సంవత్సరాల తరువాత పెద్దమ్మ తల్లి బొడ్రాయి ఊరి దేవర (గ్రామోత్సవం) జరుగుతోందన్నారు. కుల,మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పార్టీకి సంబంధించి ఎన్నో కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించామని అన్నింటా ప్రజలు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. వారందిరికీ విందు ఏర్పాటు చేసే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. దాదాపు 30 వేల మందికి పైగా విందు భోజనాలను సిద్ధం చేయిస్తున్నట్లు వివరించారు.

ఏర్పాట్లు ముమ్మరం

గ్రామోత్సవంలో భాగంగా భారీ ఎత్తున తోపుదుర్తి గ్రామంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పదుల సంఖ్యలో ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. అలాగే భోజనాలు వండే చోట, భోజనాలు ఏర్పాటు చేసిన చోట టెంట్లు వేయించారు.

మంటగలసిన మానవత్వం

ఊరంతా సంక్రాంతి పండుగ సంబరంగా జరిగింది.. పల్లె జనం ఆదమరిచి నిద్రిస్తున్న వేళ.. చిమ్మచీకటి.. చుట్టూ కంపచెట్లు.. ఊరు మధ్యన మురుగు కాలువ పక్కన అప్పుడే కళ్లు తెరిచిన పసికందు అరుపులు.. అరమెలకువలో వినిపించీ..వినిపించని అలికిడి.... పొరుగువారు 'చలి'ంచారు.. ఏమైందో పాపం అనుకున్నారు.. దిక్కులు తేరిపార చూసినా ఎవరూ కనిపించలేదని నిద్రకు ఉపక్రమించారు. చీకటి తొలగినా పొగమంచు కప్పేసింది.. పురిటిబిడ్డ అటుగా వెళ్లేవారి కంట పడింది.. విషయం ఆ నోటా ఈ నోటా పడింది.. ఊరంతా అక్కడి చేరుకుంది. అయ్యో.. అని అరచేతుల్లోకి తీసుకుని ఆదరాబాదరాగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అన్ని ప్రయత్నాలు చేసినా నిర్జీవం మిగిలింది. చూడముచ్చటగా ఉన్న మృత శిశువును చూసి హృదయం ద్రవించింది. ఆడపాప అవసరం లేకనా.. ఆలనాపాలన చూడలేకనా.. ఎవరిది తప్పు.. ఏది వాస్తవం..? మానవత్వం మంటగలిసే ఈ ఘటన గన్నేవారిపల్లిలో చోటు చేసుకుంది.

- మురుగు పక్కన పసికందు
- రాత్రంతా చలిలోనే వెక్కివెక్కి ఏడ్చి..
- ఉదయం ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యం

తాడిపత్రి: గన్నేవారిపల్లి కాలనీలోని ప్రైవేట్ పాఠశాల సమీపంలోని నివాసాల మధ్య ఓపెన్ డ్రెయిన్ పక్కన సోమవారం అర్ధరాత్రి పురిటిబిడ్డను ఎవరో వదిలేసి వెళ్లిపోయారు. శిశువు ఏడుపు వినిపించినా అటు ఇటు చూశారు. ఏమీ కనిపించకపోవడంతో పిల్లి అరుస్తోందేమోనని భావించి మిన్నకుండిపోయారు. మంగళవారం తెల్లవారుజామున కొన ఊపిరితో ఉన్న ఆడ శిశువును గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్‌ఐ మహ్మద్ గౌస్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న సచివాలయ మహిళా పోలీస్ శారద స్థానికులతో కలిసి శిశువును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు శిశువుకు చికిత్స అందించేలోపు మృతి చెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.



మృతి చెందిన ఆడ శిశువు

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం

- ఉపాధ్యాయుల సర్దుబాట్లపై విమర్శలు
- సుదూర ప్రాంతాలకు సీనియర్లు
- నగరానికి చేరువలో జూనియర్లు
- అడ్‌హాక్ పదోన్నతులు దక్కిన వారికే కౌన్సెలింగ్

- మడకశిరలోని ఓ మారుమూల ప్రాంతంలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పోస్టు సర్‌ప్లస్ అయింది. ఆయన్ని నేరుగా అనంతపురం మండల పరిధిలోని ఓ ఉన్నత పాఠశాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు.
- గుత్తి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఓ సీనియర్ ఉపాధ్యాయుడి పోస్టు రేషనలైజేషన్‌లో పోయింది. అయినప్పటికీ తాడిపత్రి మండలంలోని మారుమూల ప్రాంతానికి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. ఇలా వీరికే కాదు వందలాది మంది ఉపాధ్యాయులకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

అనంతపురం: విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయంతో చేపట్టిన బదిలీ గందరగోళం రేపింది. కొందరికి మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేసి.. అత్యధికమందిని సీనియారిటీ ప్రాతిపదికన కాకుండా అధికారులు ఇష్టారాజ్యంగా బదిలీ చేయడం విమర్శలకు తావిచ్చింది. ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేసిన నేపథ్యంలో సబ్జెక్టు టీచర్లు ఉండాలనే నిర్ణయంతో ప్రభుత్వం 'సర్దుబాటు' ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అర్హులైన ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్ (అడ్‌హాక్ పదోన్నతి)గా అవకాశం కల్పించింది. రేషనలైజేషన్‌లో పోస్టు పోయే ప్రమాదం ఉంటే వారికి సబ్జెక్టు కన్వర్షన్‌కు అవకాశం కల్పించింది. దీంతో ఫిజిక్స్ బోధించే స్కూల్ అసిస్టెంట్లు ఎక్కువ మంది మేథమేటిక్స్ సబ్జెక్టు కన్వర్షన్‌కు అవకాశం దక్కించుకుని అదే స్థానాల్లో కొనసాగే ఆస్కారం ఏర్పడింది. అయితే ఇన్ని వెసులుబాట్లు కల్పించినా.. విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలు ఉపాధ్యాయుల్లో ఆందోళనకు గురి చేస్తున్నాయి.

కోరుకున్న చోటుకు జూనియర్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 652 పోస్టులు సర్‌ప్లస్‌గా ఉన్నాయి. 142 పోస్టులు కన్వర్షన్‌గా ఉన్నాయి. 191 మంది అడ్‌హాక్ పదోన్నతి పొందారు. మొత్తం 985 మంది ఉపాధ్యాయులకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ (సర్దుబాటు) చేశారు. వీరిలో 191 మంది(జూనియర్ల)కి మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా కోరుకున్న స్థానాలు కేటాయించారు. తక్కిన 794 మందికి కౌన్సెలింగ్ లేకుండా డీవైఈఓలు, ఎంఈఓలు ఇష్టానుసారంగా స్థానాలు కేటాయించారు. వీరిలో అనుకూలమైన ఉపాధ్యాయులకు మంచి స్థానాలు, అనుకూలం లేని వారికి సుదూర ప్రాంతాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. మొత్తం 985 మందికీ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించి ఉంటే పారదర్శకంగా ఉండేది.

అందరికీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

అందరికీ కౌన్సెలింగ్ ద్వారానే స్థానాలు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నెల 14 నుంచి 17 వరకు నిర్వహించిన తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్–1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి.రవీంద్ర డిమాండ్ చేస్తూ ఇన్‌చార్జ్ డీఈఓకు వినతిపత్రం అందజేశారు. సీనియార్టీ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలని ఫోర్టో రాష్ట్ర చైర్మన్ కరణం హరికృష్ణ, రాష్ట్ర ముఖ్య సలహాదారు గాండ్లపర్తి శివానందరెడ్డి కోరారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోయేలా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

- సర్‌ప్లస్, కన్వర్షన్‌లో ఎవరికైనా అన్యాయం జరిగి ఉంటే లిఖితపూర్వకంగా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య తెలిపారు.



డీఈఓ కార్యాలయంలో సమస్యను వివరిస్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

ఏఆర్ సిబ్బందికి 'మొబలైజేషన్'

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరోసారి సాధన చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా మరింత బలపడవచ్చునని ఏఆర్ సిబ్బందికి అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, హనుమంతు సూచించారు. ఏఆర్ సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండు వారాల ' మొబలైజేషన్ ' కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో వారు ప్రారంభించి, మాట్లాడారు. ఏఆర్ సిబ్బందికి ఏటా మొబలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఫిజికల్ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బీడీ టీం, ప్రిజనర్స్ ఎస్కార్ట్, పీఎస్ఓలు, డ్రైవర్లు తదితర సిబ్బంది శిక్షణలో పాల్గొని నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో కలసి స్థానిక పోలీస్ పరేడ్ మైదానానికి వెళ్లిన అధికారులు, అక్కడ సిబ్బంది నైపుణ్యానికి సంబంధించిన సామర్థ్య పరీక్షలను స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ శివరాముడు, పలువురు ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

రిమాండ్‌కు ఘరానా మోసగాళ్లు

- నకిలీ డాక్యుమెంట్లతో రూ. 60 లక్షల విలువైన ప్లాటు కాజేసే యత్నం
- ముఠా గుట్టును రట్టు చేసిన అనంతపురం రూరల్ పోలీసులు
- ఎనిమిది మంది అరెస్ట్
- నిందితుల్లో టీడీపీ నేత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయభాస్కరగౌడ్

రాప్తాడు రూరల్: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.60 లక్షల విలువైన ప్లాటును కొట్టేయాలనుకునే ముఠా గుట్టును అనంతపురం రూరల్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను మంగళవారం అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ విజయభాస్కరగౌడ్ వెల్లడించారు.

పట్టుబడింది వీరే...

పోలీసులకు పట్టుబడిన వారిలో ఉరవకొండ మండలం వెలిగొండకు చెందిన యర్రలాలెప్ప గారి శేఖర్, సయ్యద్ మహమ్మద్ రఫీ అలియాస్ రఫీ, రేనిమాకులపల్లికి చెందిన చిన్న ఎర్రిస్వామి అలియాస్ సింహ, ముష్టూరు నివాసి వడ్డే శివ, అనంతపురం నగరానికి చెందిన ఎరికల గంగమ్మ అలియాస్ గుగ్గిళ్ల గంగమ్మ, కొత్తోళ్ల పార్వతి, దేవిరెడ్డి ప్రతాపరెడ్డి, బత్తల హారికాభవానీ ఉన్నారు.

ప్రైవేట్ సర్వేయర్ కీలకం

ఉరవకొండకు చెందిన ఎస్.మహమ్మద్ రఫీ ప్రైవేట్ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. నకిలీపత్రాలు సృష్టించి భూములు, ప్లాట్లు కాజేయడంలో ఇతను సిద్ధహస్తుడు. గతేడాది అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలోని సర్వే నంబర్ 133–3 పొలంలో పాత లేఔట్‌లో ఇంటి ప్లాటు కోసం సర్వే చేపట్టాడు. ఆ సమయంలో అక్కడున్న 6 సెంట్ల విస్తీర్ణం కలిగిన ప్లాటు వివరాలు సేకరించాడు. ఆ ప్లాటును యజమాని శివయ్య, అతని కుటుంబ సభ్యులెవరూ పట్టించుకోలేదని తెలుసుకున్న రఫీ... రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకలు పత్రాలు సేకరించాడు.

నకిలీలను తీసుకొచ్చి

నకలు పత్రాలతో ప్లాటు విక్రయానికి సిద్ధమైన రఫీ.. అనంతపురానికి చెందిన పార్వతమ్మను కలసి తనకు సహకరించాలని కోరాడు. ఆమె ద్వారా అనంతపురానికి చెందిన సుల్తాన్, గంగమ్మ, కవితను కలసి వీరిలో ఒకరిని ప్లాటు అసలు యజమాని శివయ్య కుమారుడు ముత్తుమారన్‌గా, భార్య గంగమ్మ, కుమార్తె సాయికుమారిగా నటించేందుకు ఒప్పించాడు. ఇందు కోసం వారికి డబ్బు ఆశ చూపాడు. వీరి ముగ్గురి ఆధార్ కార్డుల్లోని ఫొటోలు, ఆధార్ నంబర్లు అలాగే ఉంచి చిరునామాలు మాత్రం హైదరాబాద్ పేరుతో తన ల్యాప్‌టాప్ ద్వారా మార్ఫింగ్ చేసి ప్రింట్ తీశాడు. శివయ్య ఫ్యామిలీ సర్టిఫికెట్, కూతురు సుజాత డెత్ సర్టిఫికెట్ కూడా బోగస్‌వి సృష్టించాడు.

రూ.15 లక్షలు అడ్వాన్స్

నకలు పత్రాలు, నకిలీ యజమానులను సిద్ధం చేసుకున్న తర్వాత ప్లాటు విక్రయానికి సహకరించాలంటూ తనకు తెలిసిన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు శేఖర్ చిన్న ఎర్రిస్వామి, వడ్డే శివను సంప్రదించాడు. దీంతో వారి సహకారంతో 2022, అక్టోబరు 22న అనంతపురంలోని తారకరామారావు నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణకు సెంటు రూ.10 లక్షలతో ఆరు సెంట్ల ప్లాటుకు రూ.60 లక్షల బేరం కుదుర్చుకున్నారు. రూ.15 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని అగ్రిమెంటు రాసి, నకిలీ ఓనర్లతో సంతకాలు చేయించారు. సదరు ప్లాటుకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్లు కావాలని లక్ష్మీనారాయణ అడగడంతో తెచ్చిస్తామంటూ నమ్మబలికారు.

ఒరిజనల్ డాక్యుమెంటు తయారీ ఇలా...

ప్లాటుకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంటు తయారు చేసేందుకు రఫీ మరో పన్నాగం పన్నాడు. పార్వతమ్మకు తెలిసిన ప్రతాప్‌రెడ్డి ద్వారా పాత స్టాంప్ పేపర్లు, రబ్బరు సీళ్లు తయారు చేయించి, పార్వతమ్మ మనువరాలు హారికభవానీ చేత పాత స్టాంప్ పేపర్లపై కలరు జిరాక్స్ డాక్యుమెంట్‌లో ఉన్న మేటర్ అంతా సంతకాలతో సహ బాల్‌పాయింట్ పెన్‌తో రాయించారు. సీళ్లు వేసి సదరు డాక్యుమెంటును ఒరిజనల్ డాక్యుమెంట్‌గా చూపుతూ నకిలీ ఓనరు అయిన ముత్తుమారన్ అలియాస్ సుల్తాన్ ద్వారా లక్ష్మీనారాయణకు ఇప్పించారు. డాక్యుమెంటును పరిశీలించిన లక్ష్మీనారాయణ అది నకిలీదని గుర్తించి తనకు ప్లాటు వద్దు, తన డబ్బు వెనక్కు ఇవ్వాలని గొడవపడ్డాడు. నిందితులు త్వరలో ఇస్తామని చెప్పి, ముఖం చాటేయడంతో ఈ నెల 12న అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం అనంతపురంలోని బళ్లారి రోడ్డు సమీపంలో ఉన్న సత్యదేవనగర్‌లో పార్వతమ్మ ఇంటివద్ద నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్ఐలు నబీరసూల్, చలపతి, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు.

నిందితుల్లో టీడీపీ నేత

పోలీసులకు పట్టుబడిన వారిలో రేనిమాకులపల్లికి చెందిన బోయ చిన్న ఎర్రిస్వామి అలియాస్ సింహ.. ఉరవకొండ ప్రాంతంలో టీడీపీ నేతగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గత సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుగా పోటీ చేసి ఓడిపోయాడు. ఎర్రిస్వామికి అన్ని విధాలుగా టీడీపీ ఉరవకొండ నియోజకవర్గ నేత అండదండలు ఉన్నట్లు సమాచారం. ఆయనే పెట్టుబడులు పెడుతూ లిటిగెంట్, తకరారు ప్లాట్లను చిన్న ఎర్రిస్వామితో కొనుగోలు చేయించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

సీఎం వైఎస్ జగన్‌తో ఎంపీ రంగయ్య భేటీ


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రాజకీయ, సామాజిక, అభివృద్ధి పనులపై చర్చించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

ఉరవకొండ రూరల్: మండలంలోని మోపిడి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన 420 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో సబ్‌స్టేషన్‌లో పెరిగిన గడ్డి, చెట్లు పూర్తిగా కాలిపోయాయి. గమనించిన సబ్‌స్టేషన్ సిబ్బంది, ప్రజలు మంటలు ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు పూర్తిగా అదుపు చేసింది.

లారీని ఢీకొన్న ఆటో

- నలుగురికి తీవ్ర గాయాలు


గాయపడ్డ హనుమక్క, జగదీష్

పామిడి: స్థానిక 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని కాగితాల వీధికి చెందిన బోయ కృష్ణ ఇటీవల ఓ సెకండ్ హ్యాండ్ ఆటో కొనుగోలు చేశాడు. దీంతో కొండాపురంలోని సుంకులమ్మ ఆలయంలో పూజలు చేయించేందుకు కుటుంబసభ్యులను పిలుచుకుని ఆటోలో బయలుదేరాడు. 44వ జాతీయ రహదారిపై అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఎదురుగా రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొంది. ఘటనలో ఆటో నడుపుతున్న కృష్ణ తలకు, అత్త హనుమక్క తలకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణ కుమారుడు జగదీష్‌కు, పక్కింటికి చెందిన లక్ష్మీదేవికి కాళ్లు, చేతులు విరిగాయి. మరో కుమారుడు శివ, కోడలు శైలజ సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. హనుమక్క, కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


నరసింహులు (ఫైల్)

యాడికి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని బుగ్గ రోడ్డులో నివాసముంటున్న పెద్ద నరసింహులుకు, భార్య కళావతి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో బస్టాండుకు బయలుదేరిన నరసింహులును గుత్తి నుంచి తాడిపత్రికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహులను ప్రైవేట్ వాహనంలో తాడిపత్రిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో చిక్కబళ్లాపురం వద్ద మృతిచెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ


చోరీపై ఆరా తీస్తున్న పోలీసులు

ఉరవకొండ: స్థానిక కవితా హోటల్ సర్కిల్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం అర్ధరాత్రి కవితా హోటల్ సర్కిల్ వద్ద ఉన్న సత్యనారాయణ నిర్వహిస్తున్న గాయత్రి జనరల్ స్టోర్స్ దుకాణం తాళాలు ధ్వంసం చేసి లోపలకు చొరబడిన దుండగులు రూ.8 వేలు నగదు, రూ. 80వేలు విలువ చేసే సిగరెట్లు ఎత్తికెళ్లారు. అనంతరం ఆ పక్కనే ఉన్న ఫయాజ్ నిర్వహిస్తున్న ఆర్‌కే గిఫ్ట్స్ – నావల్టీస్ షాపులో చొరబడి రూ.12 వేలు నగదు, రూ.6వేలు విలువ చేసే గిఫ్ట్స్ అపహరించుకెళ్లారు. దీని పక్కనే ఉన్న దుస్తుల దుకాణం పైకప్పు రేకులు ధ్వంసం చేసి చోరీకు ప్రయత్నించి సాధ్యం కాకపోవడంతో పక్కనే ఉన్న మొబైల్ షాపు తాళాలు ధ్వంసం చేసి షట్టర్ ఎత్తేందుకు ప్రయత్నించారు. అది కూడా సాధ్యం కాకపోవడంతో దుండగులు వెనుతిరిగారు. చోరీ జరిగిన దుకాణాలు పోలీసులు మంగళవారం ఉదయం పరిశీలించారు. యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తోపుదుర్తిలో ఘనంగా పెద్దమ్మ గ్రామోత్సవం


ఆంజనేయస్వామి ఆలయానికి జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు


ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నివాసం నుంచి జ్యోతులతో బయలుదేరుతున్న యువతులు (చిత్రంలో) ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తిలో పెద్దమ్మ జాతర మహోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ అమ్మవారికి రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబసభ్యులు జ్యోతులు పట్టారు. ఎమ్మెల్యే స్వగృహం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకూ భక్తి శ్రద్ధలతో జ్యోతులను మోసారు. అనంతరం దేవర పోతును ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి మనోరమ, సోదరులు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి, చందు, తండ్రి ఆత్మారామిరెడ్డి, ఎస్కేయూ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు తోపుదుర్తి నయనతారెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'స్టార్'పై డీఎంహెచ్‌ఓ సీరియస్

- డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు జారీ
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..


నోటీసు అందజేస్తున్న డెమో త్యాగరాజు, సుబ్రహ్మణ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులపై ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'రాసింది ఒకటి.. చేసింది మరొకటి' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. అంతకు ముందు డీఎంహెచ్‌ఓను బాధితుడు ప్రకాష్‌రెడ్డి కలసి స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకుల తీరుపై ఫిర్యాదు చేశారు. వైద్య పరీక్షల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్న వైనాన్ని వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్టార్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డెమో అధికారులు త్యాగరాజు, సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించి, నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. రెండు రోజుల్లోపు వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

ఎమ్మార్పీఎస్ నేతకు జేసీ అనుచరుల బెదిరింపులు

తాడిపత్రి అర్బన్: తనను జేసీ ప్రభాకరరెడ్డి అనుచరులు కులం పేరుతో దూషించడమే కాక బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ పోలీసులకు ఎమ్మార్పీఎస్ నేత పెద్దిరాజు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని పశువుల ఆస్పత్రి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయం నిర్మాణం కోసం మంగళవారం కూలీలు పునాదుల తవ్వకం చేపట్టారు. విషయం తెలుసుకున్న మున్సిల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు పేరం రవి, మరి కొందరు ఎమ్మార్పీఎస్ నేత పెద్దిరాజుకు ఫోన్ చేసి స్థలం వద్దకు రప్పించుకున్నారు. జేసీ ప్రభాకరరెడ్డికి చెందిన స్థలంలో నిర్మాణం ఎలా చేపడతావంటూ కులం పేరుతో దూషణకు దిగారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తలుచుకుంటే తాడిపత్రిలో తిరగలేవని బెదిరించారు. పెద్ది రాజుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు బాల చంద్రాయుడు, మనోహర్ తదితరులు అడ్డుకోవడంతో జేసీ అనుచరులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటనపై పోలీసులకు పెద్దిరాజు ఫిర్యాదు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

రాప్తాడు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు రైతులు స్వస్తి చెప్పి పురాతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతు ఆదరణ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొందిరెడ్డిపల్లిలో అరటి మొక్కల ఉత్పత్తి చేసే టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి, ఉద్యాన సహాయ సంచాలకుడు నరసింహారావు, ఉద్యాన అధికారి రత్నకుమార్, రైతు భరోసా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

పామిడి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన అక్షింతల నల్లప్ప (45)కు భార్య ఆదిలక్ష్మి, ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులో అధిక భాగం వృథాగా ఖర్చు చేస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారిందంటూ భర్తను భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నల్లప్ప మంగళవారం పామిడి పక్కనే ఉన్న పెన్నానదిలోని గంగమ్మ గుడి వద్ద క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

12 టింబర్ డిపోల సీజ్

అనంతపురం సెంట్రల్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో నిర్వహిస్తున్న 12 టింబర్ డిపోలను అటవీ శాఖ అధికారులు సీజ్ చేశారు. డీఎఫ్‌ఓ సందీప్‌కృపాకర్ ఆదేశాల మేరకు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ రెన్యువల్ లేకపోవడం, అకౌంట్స్ సబ్‌మిట్ చేయకపోవడం తదితర కారణాలతో వేణుగోపాల్‌నగర్‌లోని బాలాజీ టింబర్ డిపో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యల్లమ్మ టింబర్ డిపోలను సీజ్ చేశారు. అలాగే గుత్తి, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో పది టింబర్ డిపోలను సీజ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య


విజయ్‌కుమార్ (ఫైల్)

కళ్యాణదుర్గం: అనారోగ్య పరిస్థితులను తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని వడ్డే కాలనీకి చెందిన వడ్డే గోవిందప్ప కుమారుడు విజయ్‌కుమార్ (31) కొంత కాలంగా తెల్ల రక్తకణాల వ్యాధితో బాధపడుతున్నాడు. అనంతపురం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న విజయ్‌కుమార్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య అంజలి ఉంది. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రజకులకు న్యాయం చేస్తాం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న

రాప్తాడురూరల్: అనంతపురం మండలం ఆకుతోటపల్లిలోని దోబీఘాట్ విషయంలో రజకులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ శ్రీధరమూర్తి హామీ ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్నతో కలిసి దోబీఘాట్ స్థలాన్ని, బోరు బావిని, నీటి తొట్టెలను, ఆయన పరిశీలించారు. రజక సంఘం నాయకులు, గ్రామస్తులు, పెద్దలను విచారణ చేశారు. 40 ఏళ్లకు పైగా ఇక్కడ దోబీఘాట్‌లో రజకులు బట్టలు ఉతికేవారని గ్రామస్తులు తెలిపారు. రికార్డులు పరిశీలించి దోబీఘాట్‌కు కేటాయించిన స్థలాన్ని కచ్చితంగా వారికే దక్కేలా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, సునీల్‌దత్తరెడ్డి, నారాయణరెడ్డి, ఏపీ రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఈశ్వరయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు రోడ్డు భద్రతా అవగాహన సదస్సు

అనంతపురం సెంట్రల్: సాయినగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కల్వర్టు నిర్మాణం పూర్తిచేయాలి

అనంతపురం అర్బన్: నగర పరిధిలోని ఇందిరానగర్ వద్ద కల్వర్టు నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్వర్టు ప్రదేశం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎం నేత రామిరెడ్డి మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణం కోసం 20 రోజుల క్రితం కాలువ పగులగొట్టి వదిలేశారన్నారు. దీంతో ఇందిరానగర్ నుంచి గంగానగర్, ప్రియాంక నగర్, ముత్యాలమ్మ కాలనీ, రాజీవ్‌కాలనీ, హెచ్చెల్సీ కాలనీ తదితర కాలనీల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, ప్రసాద్, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

29న జష్నే ఖ్వాజా గరీబ్ నవాజ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 29న జష్నే ఖ్వాజా గరీబ్ నవాజ్ బయాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సాయినగర్ సున్నీ మస్జిద్ రహ్మానియా కమిటీ సభ్యులు వెల్లడించారు. ముఖ్య అతిథిగా నాసిర్ రజాఖాన్ సాహెబ్ రజ్వీ, మహమ్మద్ ఉస్మాన్ రబ్బాని, ఇబ్రహీం అలీ ఖాదరీ హాజరవుతారని పేర్కొన్నారు.

పెన్షనర్ల ధర్నా

అనంతపురం సిటీ: పెన్షన్ రివిజన్ కోసం బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు పెన్షనర్లు మంగళవారం మంగళవారం క్లాక్‌టవర్ వద్దనున్న ఆ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బుధవారం కూడా ధర్నా కొనసాగుతుంది. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంక్షేమ సంఘం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ రాజశేఖరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, యూనియన్ ప్రతినిధులు సుబహాన్, నాగరాజు, ముత్యాలప్ప, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటించండి

అనంతపురం క్రైం: రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో మూలన పెట్టిన మొక్కలను తక్షణమే వివిధ ప్రాంతాల్లో నాటించేలా చర్యలు తీసుకోవాలని డీఈ రాంప్రసాద్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన పార్క్‌ను ఆయన పరిశీలించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

అనంతపురం అర్బన్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 30 గంటల వంటావార్పు కార్యక్రమం నిర్వహించతలపెట్టామన్నారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన వారందరికీ స్థలం మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. '90 రోజులల ఇంటి స్థలం' కింద దరఖాస్తున్న చేసుకున్న వారిలో అర్హులకు తక్షణం ఇంటి పట్టా ఇవ్వాలన్నారు. కార్మికులు, రైతుల, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 31న కార్మిక, కర్షక సదస్సు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకుడు బాలరంగయ్య పాల్గొన్నారు.

విలేకరిపై ఆరోపణలు తగదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జరుగుతున్న అక్రమాలపై వార్త రాసిన విలేకరిపై పూజారులు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేయడం తగదని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి బడా శ్రీనివాసరెడ్డి ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ ఫక్కీరప్పను ఏపీయూడబ్ల్యూజే నాయకులు పయ్యావుల ప్రవీణ్‌కుమార్, కేపీ కుమార్, రసూల్, చౌడప్ప, మల్లేష్‌తో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.

వరద కష్టాలకు త్వరలో చెక్

- నడిమివంక రక్షణగోడ, అభివృద్ధి పనులకు చర్యలు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: నగరంలో వరద కష్టాలకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. భారీ వర్షాలకు నడిమివంక పొంగితే రంగస్వామినగర్, సోమనాథ్‌నగర్, యువజన కాలనీ, గౌరవ్ గార్డెన్, వడ్డే వారి కాలనీ తదితర ప్రాంతాలకు ముంపునకు గురవుతున్నాయన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు నడిమివంకకు రక్షణ గోడల నిర్మాణం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. మంగళవారం 47వ డివిజన్‌లోని యువజన కాలనీలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ దుర్గాదేవితో కలిసి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ అనే స్థానికుడు వరదల సమయంలో నడిమివంకకు ఆనుకుని ఉన్న ఇళ్లవారు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 2008లోనే తాను ఎంపీగా, బి.నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నపుడు రూ.58 కోట్లతో నడిమివంకకు రక్షణ గోడలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత.. ఆ పనుల్లో మిగిలిన రూ.18 కోట్ల నిధులను రక్షణ గోడలకు కేటాయించకుండా చెరువుకట్టకు మళ్లించారని అనంత వివరించారు. ఇప్పుడు అవే పనులకు రూ.43 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. యువజన కాలనీలో సాధారణ నిధులు రూ.9.9 లక్షలతో రోడ్డు, రూ.8.5 లక్షలతో మరో రోడ్డు, రూ.9.8 లక్షలతో డ్రెయినేజీ నిర్మిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డైరెక్టర్లు గౌస్‌బేగ్, గోవిందు, వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, చంద్రమోహన్‌రెడ్డి, ఎంఎల్‌ఓ డాక్టర్ దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధు, భారతి, జఫార్ తదితరులు పాల్గొన్నారు.



యువజన కాలనీలో లబ్ధిదారులకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

జగనన్న మేలును మరువలేం..

- తనకు ఒంటరి మహిళ పింఛన్, ఇంటి పట్టా, కూతురు జయశ్రీకి అమ్మఒడి మంజూరు చేసిన జగనన్న మేలును మరువలేనని యువజన కాలనీకి చెందిన భాను అనే మహిళ ఎమ్మెల్యే వద్ద సంతోషం వ్యక్తం చేసింది.
- ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చి.. ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, షూస్ తదితర వాటిని అందించి ఉన్నత చదువులు చదివిస్తున్న సీఎం జగన్ సార్‌కు రుణపడి ఉంటామని శారద హైస్కూల్ విద్యార్థినులు ప్రభావతి, రాజేశ్వరి ఎమ్మెల్యేతో ఆనందం పంచుకున్నారు.
- 'చేయూత' సొమ్ముతో బట్టల వ్యాపారం పెట్టుకుని జీవనం సాగిస్తున్నానని నిర్మలాదేవి అనే మహిళ పేర్కొంది.
- నడవలేని స్థితిలో ఉన్న తనకు పింఛన్‌తో పాటు కుమారుడు విక్రమ్‌కు అమ్మఒడి అందిస్తున్న ముఖ్యమంత్రికి వెంకటమ్మ అనే మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

పాతికేళ్ల కల నెరవేర్చాం

అనంతపురం రూరల్: రాజీవ్ కాలనీలోని 400 మందికిపైగా పేదలకు ఇళ్ల పట్టాలు అందించి తమ ప్రభుత్వం పాతికేళ్ల కల నెరవేర్చామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజీవ్ కాలనీ పంచాయతీలోని లీలమ్మ కాలనీ, మహదేవనగర్‌లో సర్పంచ్ ఆశాబీ, ఉప సర్పంచ్ మసూద్‌వలి, ఎంపీటీసీలు సంధ్య, రమీజాబితో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తమ ప్రభుత్వంలో ఇంటి పట్టా మంజూరుతో పాటు రూ.20 కోట్లతో బ్రిడ్జి, రోడ్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, రాజీవ్ కాలనీ రూపురేఖలు మార్చామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, రహీమ్, అంజి, దౌలా తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సీతారాముల కల్యాణ వేడుకలు



వివరాలు వెల్లడిస్తున్న సంఘం కార్యకర్తలు

అనంతపురం కల్చరల్: సాములదొడ్డి అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు సీతారామ కల్యాణం, సప్తాహం తదితర వేడుకలు నిర్వహించనున్నట్లు పవన సుత యువజన సంఘం కార్యకర్తలు ప్రమోద్‌స్వామి, సుంకు వేణుగోపాల్, సత్యనారాయణ, వెంకటేశ్వరప్రసాద్, శ్రీధర్, మురళి తెలిపారు. మంగళవారం వారు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఏడు రోజుల పాటు శ్రీరామ జయరామ అనే మహామంత్రం కార్యక్రమంలో 50 బృందాలు పాల్గొంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు 41వ డివిజన్‌లో 'గడప గడపకూ'

అనంతపురం క్రైం: నగరంలోని 41వ డివిజన్‌లో బుధవారం ఉదయం 6.30 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని యువజననగర్ సర్కిల్, హైమాస్ లైట్స్ వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

పెద్దమ్మ తల్లీ నమో నమః





అలంకరణలో పెద్దమ్మ తల్లి, పోతలయ్యస్వామి విగ్రహాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో మంగళవారం పెద్దమ్మ, పోతలయ్యస్వాముల ఊరు దేవరను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దేవర పోతులను బలి ఇచ్చారు. గ్రామస్తులు పోతులయ్య స్వామికి బోనాలు సమర్పించి గావుల మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం జనసందోహం మధ్య గ్రామ దేవతలను ఊరేగించారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి: ఊరు దేవరకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పెద్దమ్మ, పోతలయ్యస్వామి ఆలయాల్లో జరిగిన పూజలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పోతలయ్య ఉత్సవ విగ్రహం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఊరు దేవర ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసు, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగుల సుధీర్‌రెడ్డి, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రోడ్లపై చెత్త కన్పించరాదు



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

అనంతపురం క్రైం: రోడ్లపై చెత్త కన్పించరాదని, ఎప్పటికప్పుడు చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.భాగ్యలక్ష్మి కార్మికులను ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకే కార్యాలయానికి వెళ్లి కార్మికుల హాజరుపట్టికను పరిశీలించారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు.

విధుల్లోకి ఏసీపీ

అనంతపురం క్రైం: ఈ నెల రెండో తేదీ నుంచి సెలవుపై వెళ్లిన నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాసులురెడ్డి మంగళవారం విధుల్లోకి చేరారు. తొలుత ఆయన కమిషనర్ భాగ్యలక్ష్మి వద్ద రిపోర్టు చేసుకున్నారు.

ఉద్యాన పథకాలపై ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

అనంతపురం అగ్రికల్చర్: అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఉద్యానశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. డీడీ రఘునాథరెడ్డి, ఏడీ నరసింహారావు, హెచ్‌ఓలు రత్నకుమార్, చందనతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీల గురించి తెలుసుకున్నారు. జిల్లాలో పండ్లతోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల విస్తీర్ణం, పెట్టుబడులు, దిగుబడులు, మార్కెటింగ్ స్థితిగతులు, రైతుల పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం రాప్తాడు మండలంలో దానిమ్మ, బీర పంటలు, అరటి మొక్కల ల్యాబ్‌ను సందర్శించారు.

రెండు రోజుల్లో ప్రతిపాదనలు



విశ్వశాంతినగర్‌లో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం రూరల్: వరదల కారణంగా దెబ్బతిన్న బ్రిడ్జి, కల్వర్టు, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి రెండు రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే అనంత ఆదేశించారు. మంగళవారం ఆయన రుద్రంపేట పంచాయతీ విశ్వశాంతినగర్, ఉదయ్ కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, రుద్రంపేట సర్పంచ్ పద్మావతి, వైస్ సర్పంచ్ నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ ఓంప్రకాష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలు ఇప్పుడు గుర్తొచ్చారా?

- ఓటు బ్యాంకు కోసం కపట ప్రేమ
- ప్రతిపక్ష నేత చంద్రబాబుపై మేయర్ వసీం ధ్వజం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: ప్రతిపక్ష నేత చంద్రబాబు మైనార్టీ పట్ల కపట ప్రేమ ఒలకబోస్తున్నారని మేయర్ వసీం విమర్శించారు. అధికారంలో ఉన్నపుడు మైనార్టీలను విస్మరించారని, ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వలేకపోయారని విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మైనార్టీలకు సముచిత స్థానం, గుర్తింపు లభించాయని తెలిపారు. అన్నమయ్య జిల్లా పీలేరు సబ్‌జైలులో ఉన్న టీడీపీ ముస్లిం నేతల పరామర్శించేందుకు శాసన మండలి మాజీ చైర్మన్, టీడీపీ మైనార్టీ రాష్ట్ర నాయకుడు అహ్మద్ షరీఫ్‌ను చంద్రబాబు పట్టించుకోకుండా అవమానించడంపై మేయర్ మంగళవారం స్పందించారు. టీడీపీ హయాంలో మైనార్టీలకు ఎటువంటి ప్రాధాన్యతా దక్కలేదన్నారు. ఆఖరికి మైనార్టీ శాఖను కూడా ఓసీ సామాజికవర్గం వారికి కట్టబెట్టి మైనార్టీలను వంచించారన్నారు. ఇటీవల చిత్తూరులో ముస్లిం సోదరుడు టోపీ ధరింపజేయడానికి వస్తే అసహ్యించుకున్న చంద్రబాబుకు మైనార్టీలంటే చాలా చిన్నచూపని అన్నారు. వైఎస్సార్‌సీపీ పని అయిపోయిందంటూ విమర్శలు చేసిన ప్రతిపక్ష నేత ముందు కుప్పంలో పార్టీలుగా విడిపోయిన సైకిల్‌ను సరిచేసుకుంటే మంచిదని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఆనవాళ్లు లేకుండా పోతుందన్నారు. ఇక నగరంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి సైతం స్వార్థ రాజకీయాల కోసం మైనార్టీలను వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా టీడీపీ నాయకులు చౌకబారు రాజకీయాలకు స్వస్తి పలకాలని సూచించారు. జగనన్న పాలనలో ముస్లింలకు సముచిత స్థానం దక్కిందని స్పష్టం చేశారు. మేయర్, అనంతపురం మార్కెట్‌యార్డు చైర్మన్, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, ఉర్దూ అకాడమీ చైర్మన్, పది కార్పొరేట్ స్థానాల్లో ముస్లింలకు అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇస్హాక్, సైఫుల్లాబేగ్, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకపోతే చర్యలు



ఐదో రోడ్డులో పన్ను చెల్లింపుపై ఆరా తీస్తున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ఇంటి, నీటి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం నగరంలోని 1, 2, 3, 4, 5 రోడ్లలో పన్ను చెల్లించని వారి ఇళ్ల వద్దకు ఆయన వెళ్లారు. నీటి పన్నును దశల వారీగా చెల్లించాలని, లేని పక్షంలో పలుమార్లు నోటీసులు జారీ చేసి, నగరపాలక సంస్థ అందించే సరీ్వసులను తొలగించాలని సచివాలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 66వ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీ వంతెన ప్రారంభానికి సన్నాహాలు



ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్షిస్తున్న డీఈఈ

అనంతపురం సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావస్తుండడంతో వాటిని ప్రారంభించే అంశంపై పంచాయతీరాజ్ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా అనంతపురం శివారులోని రాజీవ్ కాలనీకి ఆనుకుని ఉన్న నడిమివంకపై రూ.3.36 కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభానికి ముస్తాబైంది. ఈ నెల 27న ప్రారంభం చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జెడ్పీ ఆవరణలోని తన కార్యాలయంలోని చాంబర్‌లో ఇంజినీర్లు, కాంట్రాక్టర్‌తో పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భరత్‌ప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ పాండురంగారెడ్డి, జేఈ ప్రసాద్, కాంట్రాక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌ఐ శ్రీహర్ష

బత్తలపల్లి: తప్పిపోయి ఒంటరిగా విలపిస్తున్న బాలుడిని తల్లిదండ్రుల చెంతకు బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష చేర్చారు. వివరాలు.. అనంతపురంలోని సాయినగర్ ఫస్ట్ క్రాస్‌లో నివాసముంటున్న బాలకృష్ణ, హరిత దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. మంగళవారం ఉదయం ముదిగుబ్బ మండలం మంగళమడక నుంచి అనంతపురానికి హరిత తన ఇద్దరు పిల్లలతో కలసి ఆర్టీసీ బస్సులో ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బస్సులో సీటు లేకపోవడంతో పెద్ద కుమారుడు అఖిల్‌ను ఓ ప్రయాణికుడి వద్ద కూర్చోబెట్టి చిన్నారితో కలసి మరో సీటులో ఆమె కూర్చొంది. మార్గమధ్యంలో బత్తలపల్లి రాగానే తాను కూర్చొన్న వ్యక్తి వెనుకనే అఖిల్ కూడా బస్సు దిగాడు. ఈ విషయాన్ని తల్లి గమనించలేదు. ఎస్కేయూ వద్దకు బస్సు చేరుకుంటుండగా అఖిల్ తప్పిపోయినట్లుగా తల్లి గుర్తించి విషయాన్ని భర్త బాలకృష్ణకు చేరవేసింది. బస్సు అనంతపురం చేరుకోగానే దంపతులిద్దరూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే బత్తలపల్లిలో ఒంటరిగా ఏడుస్తున్న బాలుడిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత సంద్రా రామకృష్ణ, కుమ్మర శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు మదనాపు శ్రీనివాసులు గుర్తించి చేరదీసి ఎస్‌ఐ టీవీ శ్రీహర్షకు అప్పగించారు. కాసేపు బుజ్జగించిన అనంతరం తన పేరు అఖిల్ అనిడాడీ పేరు బాల అని, తల్లిని మమ్మీ అని, రామన్ స్కూల్‌లో చదువుతున్నట్లు తెలిపాడు. ఎలా వచ్చావనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. దీంతో విషయాన్ని అనంతపురం పోలీసులకు ఎస్‌ఐ శ్రీహర్ష చేరవేశారు. విషయం తెలుసుకున్న బాలకృష్ణ బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్‌ఐతో మాట్లాడారు. తగిన ఆధారాలు చూపిన తర్వాత బాలుడిని తండ్రికి పోలీసులు అప్పగించారు. కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఎండీయూ ఆపరేటర్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడురూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ఇంటింటికీ సరుకులు రవాణా చేసేందుకు ఉపయోగిస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్ల స్థానాల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం తహశీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కక్కలపల్లి కాలనీ (ఓసీ), ఎ.నారాయణపురం (బీసీ), తాటిచెర్ల, సోములదొడ్డి గ్రామానికి (ఎస్సీ) కేటగిరీలో ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఎండీయూ ఆపరేటర్‌కు నెలకు రూ.18 వేల జీతం ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఏడో తరగతి విద్యార్హత ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం లేదా ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89195 09889 నంబరుకు ఫోన్ చేయొచ్చని పేర్కొన్నారు.

నేడు ఎం.చెర్లోపల్లిలో ఊరు దేవర

రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో బుధవారం ముత్యాలమ్మ స్వామికి మబ్బు దేవర (ఊరు దేవర–జాతర) నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఐదేళ్లకోకసారి జరుగుతున్న దేవరలో పాల్గొనేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం చేరుకుంటున్నారు.

ముక్కులో గడ్డకు అరుదైన చికిత్స



శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ రాఘవేంద్రరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముక్కులో గడ్డకు ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేట్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి సమస్యను పరిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కంబదూరు మండలం అండేపల్లికి చెందిన వెంకటేష్ శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది ఉండటంతో అనంతపురంలోని కిమ్స్ సవీర ఆస్పత్రికి వెళ్లాడు. రైనోస్పోరిడియోసిస్ అనే ఇన్ఫెక్షన్ వల్ల ముక్కులో గడ్డ ఏర్పడటంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారినట్లు వైద్య పరీక్షల్లో గుర్తించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వెంకటేష్‌కు భరోసా ఇచ్చారు. ఎండోస్కోపిక్ విధానం ద్వారా అత్యంత జాగ్రత్తగా గడ్డను తొలగించినట్లు డాక్టర్ రాఘవేంద్రరెడ్డి మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ జరగడంతో వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి రోగి కృతజ్ఞతలు తెలిపారు.